సాక్షి చిత్తూరు

I

శనివారం । 18 । మార్చి । 2023



జీర్ణోద్ధరణ పనులు వేగవంతం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీప్రసన్న వరదరాజ స్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు ఊపందుకున్నాయి.



కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని వేడుకగా నిర్వహించారు. – II



పుష్పయాగానికి అంకురార్పణ

చంద్రగిరిలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం పుష్పయాగానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. - II

పీడీఎఫ్‌కు ఎదురుదెబ్బ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘోర పరాజయం

మట్టికరిపించిన వైఎస్సార్‌సీపీ

- వామపక్ష విధానాలకు తిలోదకాలిచ్చిన సీపీఎం, సీపీఐ
- టీడీపీతో చేతులుకలిపినా వరించని విజయం
- ప్రతి రౌండ్‌లోనూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థికి ఆధిక్యం

ఒకప్పుడు సమసమాజం.. పేదరిక నిర్మూలన, సమాన పనికి సమాన వేతనం.. అంటూ విప్లవ భావాలను పుణికిపుచ్చుకుని ఉద్యమకెరటాల్లా ఉవ్వెత్తున ఎగసే వామపక్షాలు ఇప్పుడు దిగజారిపోయాయి. ఏ ఎండకాగొడుగు పడుతూ సిద్ధాంతాలను గాలికి వదిలేసి అడ్డదారులు తొక్కుతున్నాయి. అందులో భాగంగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీతో లోపాయికారి ఒప్పందం కుదురుకుని వైఎస్సార్‌సీపీని దెబ్బకొట్టాలని భావించాయి. ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగకుండా అడగడుగునా అడ్డుతగిలాయి. కానీ వారి వ్యూహాలు, కుట్రలు, కుతంత్రాలు పటాపంచలయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయకేతనం ఎగురవేశారు. పీడీఎఫ్ విజయపరంపరకు అడ్డుకట్ట వేశారు.

సాక్షి, తిరుపతి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల చరిత్రలో ఓటమి ఎరుగని పీడీఎఫ్‌కు వైఎస్సార్‌సీపీ గట్టి షాక్ ఇచ్చింది. మొదటి సారిగా పీడీఎఫ్‌కు ఓటమిని రుచిచూపించింది. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఘన విజయం సాధించారు. ఉమ్మడి ప్రకాశం– నెల్లూరు– చిత్తూరు జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఇటీవల ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ప్రజల్లో ఉన్న మద్దతును దృష్టిలో ఉంచుకుని ఓటమి తప్పదని భావించింది. వామపక్ష భావాలకు విరుద్ధంగా సీపీఎం, సీపీఐ నాయకులు టీడీపీతో పొత్తుపెట్టుకుని నానాతంటాలు పడ్డారు. టీడీపీ పొత్తుతో పీడీఎఫ్ అభ్యర్థికి ఎన్నోకొన్ని ఓట్లు వస్తాయని భావించాయి. అందులో భాగంగా టీడీపీతో కలిసి ఎన్నికలకు ముందు నుంచి నానారభస చేశారు. నిజమైన ఓటర్లను సైతం దొంగ ఓటర్లుగా చిత్రీకరించి భయభ్రాంతులకు గురిచేశారు. ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.

విజయ'శేఖరుడు'

చిత్తూరు ఎస్వీ సెట్‌లో గురువారం నిర్వహించిన కౌంటింగ్‌లో పీడీఎఫ్ అభ్యర్థి ఏ ఒక్క రౌండ్‌లోనూ మెజారిటీ సాధించలేకపోయారు. మొదటి రౌండ్ నుంచి రెండో ప్రాధాన్యత ఓటు లెక్కింపు వరకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి ఆధిక్యం కనబరుస్తూ వచ్చారు. శుక్రవారం వేకువజాము వరకు ఉత్కంఠగా సాగిన కౌంటింగ్‌లో పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి విజయఢంకా మోగించారు. ఎన్నికలు ఏవైనా... ప్రతిపక్షంలో ఎవరున్నా... వైఎస్సార్‌సీపీకే తమ మద్దతు అని ఉపాధ్యాయ ఓటర్లు మరోసారి రుజువుచేశారు.

పీడీఎఫ్‌కు మొదటి సారి ఓటమి

పీడీఎఫ్‌కు మొదటి సారి ఓటమి ఎదురైంది. 1985లో అప్పటి సీఎం ఎన్టీ రామారావు శాసనమండలి వ్యవస్థను రద్దు చేశారు. ఆ తర్వాత 2007లో దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి తిరిగి శాసనమండలి వ్యవస్థను పునరుద్ధరించారు. అప్పటి నుంచి మూడు సార్లు మండలి ఎన్నికలు నిర్వహించారు. 2007లో పీడీఎఫ్ అభ్యర్థి దాచూరి రామిరెడ్డి టీచర్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2011–2017, 2017–2023 వరకు పీడీఎఫ్ అభ్యర్థి విఠపు బాలసుబ్రహ్మణ్యం టీచర్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. గత 16 ఏళ్లుగా టీచర్ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకుంటున్న పీడీఎఫ్‌కు మొదటి సారి ఎదురుదెబ్బ తగిలింది.



రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ చేతులమీదుగా డిక్లరేషన్ పత్రం అందుకుంటున్న చంద్రశేఖర్‌రెడ్డి

టీచర్లకు ధన్యవాదాలు

టీచర్లు తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించినందుకు ధన్యవాదాలు. ఉపాధ్యాయులు ఇచ్చిన మద్దతు ఎప్పటికీ మరువలేను. వారి సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తా. క్షేత్రస్థాయిలో ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకురావచ్చు.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీకి సత్కారం

నాయుడుపేట: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి నాయుడుపేట పట్టణంలోని జువ్వలపాళెం వద్ద ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. పూలమాల వేసి, శాలువాలు కప్పి ఆత్మీయంగా సన్మానించారు. ప్రయివేట్ పాఠశాలల గౌరవ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, పాఠశాలలు, కళాశాలల కరస్పాండెంట్‌లు తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, నవోదయ పద్మనాభరెడ్డి, సురేష్‌రెడ్డి, గోపాల్ నాయుడు, వేణుగోపాల్, శ్రీధర్‌రెడ్డి, రాజేష్, దినేష్, అల్లెయ్య, సురేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న నేతలు, ఉపాధ్యాయ సంఘాలు

శ్రీకాళహస్తి: తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వర ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమానికి పలువురు విచ్చేసి ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, విద్యాసాగర్, చిలకా రంగయ్య, ఢిల్లీబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, టీచర్ల ఎమ్మెల్సీ బయోడేటా



పేరు : పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

తల్లిదండ్రులు : పర్వత రెడ్డి సుందరరామిరెడ్డి, పర్వత రెడ్డి సుజాతమ్మ

స్వగ్రామం : వల్లిపేడు గ్రామం, చిల్లకూరు మండలం, తిరుపతి జిల్లా.

ప్రస్తుతం : రాంజీనగర్ మూడవ వీధి, చిల్డ్రన్స్ పార్క్ దగ్గర, నెల్లూరు.

పుట్టిన తేదీ : 26–06–1972

విద్యార్హతలు : ఎమ్మెస్సీ (మ్యాథ్స్)

విద్యార్థి దశ : 1987లో నెల్లూరు డీసీఆర్ జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి, 1989–92లో సర్వోదయ కళాశాలలో ఇంటర్, డిగ్రీ, 1994లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, అనంతరం ఎంబీఏను పూర్తి చేశారు.

ప్రస్తుతం : చైర్మన్, శ్రీ కృష్ణ చైతన్య విద్యాసంస్థలు

సేవా కార్యక్రమాలు

24 ఏళ్లుగా నెల్లూరు నగరంలో కృష్ణ చైతన్య విద్యాసంస్థల ద్వారా తక్కువ ఫీజుతో పేద విద్యార్థులకు విద్యనందిస్తున్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్‌గా చంద్రశేఖర్ రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. కరోనా సమయంలో రెడ్ క్రాస్ సేవలకు రాష్ట్ర, దేశస్థాయిలో గుర్తింపు లభించింది. కోవిడ్ వ్యాధిగ్రస్తులకు ప్లాస్మా అందించడం, ఆక్సిజన్ రథచక్రాల ద్వారా ఆక్సిజన్ బెడ్లు ఏర్పాటు చేయడం, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు అందజేయడం, కోవిడ్ మృత దేహాలకు గ్యాస్ ఆధారిత మొబైల్ క్రిమిటోరియం మిషన్ ద్వారా దహన సంస్కారాలు చేయడం, కోవిడ్ బాధితులకు మందులు, వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం.. లాంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆయన సేవలకు గుర్తింపుగా 2022, ఏప్రిల్‌లో అప్పటి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నుంచి బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డును అందుకున్నారు.

న్యూస్‌రీల్

నేడు ప్రత్యేక లోక్ అదాలత్



న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కుటుంబ వివాదాలు, వినియోగదారుల ఫోరమ్‌లో పెండింగ్ కేసులను పరిష్కరించేందుకు తొలిసారిగా ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 13, చిత్తూరులో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు.

రేషన్ పంపిణీ పొడిగింపు

చిత్తూరు రూరల్: జిల్లాలో రేషన్ పంపిణీని మరో రెండు రోజులపాటు పొడిగిస్తున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 19 వరకు రేషన్ పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉద్యమి భారత్ కింద ఉచితంగా మోడెం

చిత్తూరు కార్పొరేషన్: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ వినియోగం పెంచడానికి ఉద్యమి భారత్ పథకం కింద ఉచితంగా మోడెం అందిస్తున్నట్లు బీఎస్‌ఎన్‌ఎల్ డీఈ సురేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి జిల్లాలోని పది మండలాల్లో 266 ప్రాంతాలు ఎంపికైనట్లు వెల్లడించారు. తొలుత నరహరిపేట, పాలకల, తలపులపల్లె గ్రామాల్లో పథకం అమలు చేస్తున్నామన్నారు. నెట్ ప్లాన్‌కు సొమ్ము చెల్లిస్తే ఉచితంగా మోడెం అందించనున్నట్లు చెప్పారు. రూ.390తో నెలకు 1000 జీబీ డేటాను 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో ఇంటర్‌నెట్ అందిస్తున్నామని వివరించారు. అన్‌లిమిటెడ్ కాల్స్ సైతం వాడుకోవచ్చని తెలిపారు.

వరసిద్ధునికి వెండి పాత్రలు వితరణ



కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి వెండి తీర్థ పాత్ర, ఉద్దరిణెను దాతలు వితరణ చేశారు. శుక్రవారం పలమనేరుకు చెందిన బాలాజీ, కుటుంబ సభ్యులు రూ.లక్ష విలువైన 1.2కిలోల వెండి వస్తువులను ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డికి అందించారు. ఆలయాధికారులు ఈ సందర్భంగా దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

రాహుకాల పూజలు.. పోటెత్తిన భక్తులు



చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన రాహుకాల పూజలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారి గర్భాలయాన్ని అర్చకులు శుద్ధి చేసి శాస్త్రోక్తంగా అభిషేకం జరిపించారు. అనంతరం గంగమ్మను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పాఠశాల నిధులు దుర్వినియోగం



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి : మండలంలోని బీరకుప్పం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ప్రధానోపాధ్యాయుడు దుర్వినియోగం చేసినట్లు ఎంఈఓ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో వాస్తవం గుర్తించినట్లు వెల్లడించారు. విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు లేవని, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్‌లను సరిగా దిద్దడం లేదన్నారు. ఉపాధ్యాయుల డైరీ, పాఠశాల రికార్డులు సక్రమంగా నిర్వహించడంలేదని వివరించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. ప్రధానోపాధ్యాయుడి విధులను సహోపాధ్యాయుడు సోమయ్య నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఆర్పీ శ్రీవాణి పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం తనిఖీ



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: ఎస్వీ సెట్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాన్ని ఎస్పీ రిశాంత్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఏఎస్పీ జగదీష్, డీఎస్పీ శ్రీనివాసమూర్తితో కలిసి ఓట్ల లెక్కింపును పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు 250 మంది అధికారులు, పోలీసు సిబ్బందిని పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎక్కడా ప్రజలు గుంపులు చేరకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఊరేగింపులు, బాణసంచా పేల్చడం చేయకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

అనుమతి లేకుండా ప్రవేశంపై ఆగ్రహం

అనుమతి లేకుండా చిత్తూరు ఎస్వీసెట్‌లోని ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రంలోకి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి ప్రవేశించారు. అతడిని రిటర్నింగ్ అధికారి హరినారాయణన్ గుర్తించారు. అనుమతి కార్డు లేకుండా లోనికి ఎలా పంపుతారని విధుల్లో ఉన్న సిబ్బందిపై మండిపడ్డారు. దీంతో చంద్రశేఖర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలోకి ప్రవేశించిన వ్యక్తి మీడియాలో పనిచేస్తున్నాడన్నారు. డీపీఆర్‌ఓ అనుమతితోనే వచ్చాడని, అయితే గుర్తింపు కార్డు లేనందున చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

31లోపు చెల్లిస్తే ఆస్తిపన్నుపై వడ్డీమాఫీ

చిత్తూరు అర్బన్: కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఈ నెల 31వ తేదీలోపు ఆస్తి పన్ను బకాయిలు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం చిత్తూరు నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ మాట్లాడుతూ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ప్రజలు పన్ను బకాయిలు చెల్లించి వడ్డీ మాఫీ పొందవచ్చన్నారు. సచివాలయాలు, ఆన్‌లైన్, క్యూ ఆర్ కోడ్ ద్వారా కూడా ఆస్తి పన్ను చెల్లించే అవకాశం కల్పించామన్నారు. ప్రభుత్వం అందించిన వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గజ వాహనంలో సిరుల తల్లి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం గజ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అభిషేక సేవానంతరం మరకత మాణిక్యాలు, వజ్రవైఢుర్యాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు పాంచరాత్ర ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపంలో అమ్మవారికి ఊంజల్‌సేవను నిర్వహించారు. తదుపరి అమ్మవారు గజవాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సూపరింటెండెంట్ శేషగిరి, వీఐ రామ్మోహన్ పాల్గొన్నారు.



గజవాహనంపై హారతి అందుకుంటున్న శ్రీవారి పట్టపురాణి

వడగండ్లు.. కడగండ్లు

- గాలివానకు దెబ్బతిన్న పంటలు
- నేలరాలిన మామిడి పూత, పిందెలు
- పూర్తిగా ధ్వంసమైన బీర, కాకర, బీన్స్, చిక్కుడు
- నష్టం అంచనాల్లో అధికారులు



వి.కోట మండలంలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

పలమనేరు/వి.కోట : కూలిపోయిన వృక్షాలు.. చిన్నాభిన్నమైన తీగజాతి కూరగాయ పంటలు.. విరిగిపోయిన అరటిచెట్లు.. రాలిపోయిన మామిడి పిందెలు.. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.. ఎగిరిపోయిన పూరిళ్ల పైకప్పులు.. ఇవీ గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చేతికందాల్సిన ఫలసాయం నేలపాలు కావడంతో అన్నదాతకు కన్నీళ్లే మిగిలాయి. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటిస్తూ పంట నష్టం అంచనాలను సిద్ధం చేస్తున్నారు. సకాలంలో పరిహారం అందించి రైతులను ఆదుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి వడగండ్లు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా పలమనేరు ఉద్యానశాఖ డివిజన్ పరిధిలోని వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు మండలాలతోపాటు కుప్పం తదితర ప్రాంతాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు 200 హెక్టార్లకు పైగా కూరగాయలు, తీగ పంటలతో పాటు, మరో వంద ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కూరగాయల పంటలకు నష్టం

వి.కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు మండలాల్లోని 20 పంచాయతీల్లో సుమారు 200 ఎకరాల్లో సాగు చేస్తున్న వివిధ పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా కోత దశలోని టమాట, బీన్స్, అరటి, బొప్పాయి, చిక్కుడు, మొక్కజొన్న పంటలు కుప్పకూలాయి. తోటల్లోనే టమాటాలు రాలిపోయాయి. తీగపంటలు నేలమట్టమయ్యాయి. ఈ డివిజన్‌లో ఏటా రబీ సాధారణ సాగు 4వేల హెక్టార్లుగా ఉండగా, ప్రస్తుతం 3,670 హెక్టార్లలో పంటలు సాగు చేస్తున్నారు. అకాల వర్షంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

వందెకరాల్లో మామిడికి..

బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల్లోని సుమారు వంద ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. వడగండ్ల వర్షానికి పూత, పిందె రాలిపోయింది. ఎక్కువ మంది రైతులు మామిడి తోటల ఫలసాయాన్ని ముందుగానే వ్యాపారులకు విక్రయించారు. ఇప్పుడు పంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు నగదు చెల్లిస్తారో లేదో అని దిగాలు పడుతున్నారు. అందులోనూ ఈ ఏడాది మామిడిచెట్లకు పూత బాగా పట్టింది. ఇలాంటి తరుణంలో గాలివాన బీభత్సం సృష్టించడంతో రైతులకు ఇక్కట్లు తప్పడంలేదు.

ట్రాఫిక్‌కు అంతరాయం

వి.కోట మండలంలోని కుమ్మరమగుడు, కైగల్ వద్ద జాతీయ రహదారిపై భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలాలకు చేరుకుని జేసీబీ సాయంతో చెట్లను తొలగించారు. వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

పంటల పరిశీలన

వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఆయా ప్రాంతాల్లోని ఆర్‌బీకే సిబ్బందితో కలిసి ఉద్యానశాఖ అధికారులు పరిశీలించారు. దీనిపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు హార్టికల్చర్ ఏడీ లక్ష్మీప్రసూన తెలిపారు.

కుప్పంలో..

కుప్పం రూరల్ : మండలంలో గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి 69 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. శుక్రవారం వ్యవసాయాధికారి అమృతవల్లి, ఉద్యానశాఖ అధికారి డింపుప్రియ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. నడుమూరు పంచాయతీల్లో అధికంగా పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. టమాట 30 ఎకరాలు, బంతి 15 ఎకరాలు, చిక్కుడు 5 ఎకరాలు, మిరప 2 ఎకరాలు, బంగాళదుంప 15 ఎకరాలు, స్వీట్‌కార్న్ 2 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వెల్లడించారు. నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.15 వేల చొప్పున మంజూరు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు వివరించారు.



భారీసైజు వడగండ్లు



రామకుప్ప : విరిగి ఇంటిపైకి వాలిన విద్యుత్ స్తంభం



వి.కోట : పడిపోయిన కాకర



బైరెడ్డిపల్లె మండలంలో నేలవాలిన స్వీట్‌కార్న్

'ఏక్‌భారత్- శ్రేష్ట్ భారత్'లో పలమనేరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

పలమనేరు : దేశ ప్రజల్లో ఐక్యతాభావం పెంపొందించడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించిన ఏక్‌భారత్–శ్రేష్టభారత్ కార్యక్రమంలో పలమనేరు మదర్‌థెరీసా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి మొత్తం 55 మంది హాజరవగా అందులో జిల్లా నుంచి తమ కళాశాల విద్యార్థులు ఐదుగురు ఉన్నట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు విద్యార్థులులక్ష్మి, వెన్నెల, మనోజ్‌సాయి, దిలీప్, సుఫియాను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులు మాట్లాడుతూ వారంపాటు అరుణాచల్ ప్రదేశ్‌లో పర్యటించామని, అక్కడి ఆచార వ్యవహారాలు, నాగరికత, పరిస్థితులను అవగాహన చేసుకున్నట్లు వెల్లడించారు. ఇండో–చైనా సరిహద్దులోని భారత్ ఆర్మీ కేంద్రాన్ని సందర్శించి సైనికుల అనుభవాలను తెలుసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎంఆర్ సునీల్, అకడమిక్ అడ్వైజర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, హెచ్‌ఓడీ శ్రీరామచంద్రమూర్తి, నాక్ కో–ఆర్డినేటర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

మెకానికల్ పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: జిల్లాలోని 108, 104 అంబులెన్స్ సర్వీస్‌లో మెకానికల్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎం పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు ఐటీఐలో డీజిల్ మెకానికల్ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 20వ తేదీలోపు తిరుపతి మున్సిపల్ పార్క్ వద్ద 108, 104 కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

ఇంటి ఆక్రమణపై ఫిర్యాదు


బాధితురాలు రహమత్‌బీ

రొంపిచెర్ల: ఫోర్జరీ సంతకంతో తన ఇంటిని ఆక్రమించుకున్నారని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. స్థానిక బజారువీధికి చెందిన పాలగిరి రహమత్‌బీ బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ రొంపిచెర్ల క్రాస్ వద్ద సర్వే నంబర్ 829–3బీలోని 3సెంట్లలో ఏడాది క్రితం ఇల్లు కట్టుకుంది. విద్యుత్ బిల్లులు, ఇంటి పన్నులు సైతం చెల్లించుకుంటోంది. ఆమెకు భర్త, పిల్లలు లేరు. దీంతో తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం గుల్లావాండ్లపల్లెకు చెందిన ఆమె తమ్ముడు సాయిపీర్, అతగి భార్య ఖాదర్‌బీ కలిసి రూ.100 స్టాంప్ పేపర్‌పై రహమత్‌బీ తమకు ఇల్లు రాసినట్లు సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆ ఇంటి తాళాలు పగులగొడుతుండగా బాధితురాలు అడ్డుకుంది. తన సంతకం ఫోర్జరీ చేసి నకిలీ పత్రం రాసుకోవడం అన్యాయమని వాపోయింది. దీంతో ఆగ్రహించిన సాయిపీర్ తన భార్యతో కలిసి రహమత్‌బీపై దాడి చేశారు. చంపేస్తామని బెదిరించారు. ఆందోళన చెందిన బాధితురాలు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ్ముడు, మరదలి వల్ల ప్రాణహాని ఉందని పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నంది సర్కిల్‌ను ఢీకొట్టిన టిప్పర్



తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని బసవయ్య పాళెం బైపాస్ రోడ్డు వద్ద ఉన్న నంది సర్కిల్‌ను మెగా కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ రహదారి పనులకు గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. టిప్పర్ ఢీకొన్న సమయంలో ఎటువంటి వాహనాలు అటువైపు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మద్యం మత్తులో టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


తిరుమంజనంలో భాగంగా వాహనాలను శుద్ధి చేస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు


స్వామివారికి పరదాలు, కురాళాలు, కర్టెన్లను వితరణ చేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో శుక్రవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయంలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. స్వామి బ్రహ్మోత్సవాల ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాన్ని శుద్ధి చేసి పసుపు, కుంకుమ, చందనం, సీకాయ, నామం, కర్పూరం, కిచిలీగడ్డ, కస్తూరి పసుపు, పచ్చాకులతో తయారు చేసిన సుగంధ మిశ్రమాన్ని గర్భాలయ గోడలకు పూశారు. అనంతరం ఆలయాన్ని శుద్ధి చేసి స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. డెప్యూటీ ఈఓలు నాగరత్నం, గోవిందరాజన్, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్, ప్రధాన అర్చకుడు ఏపీ.ఆనందకుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి పాల్గొన్నారు.

పరదాలు వితరణ

శ్రీకోదండరామాలయానికి పరదాలు, కురాళాలు, కర్టన్లు వితరణ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రసన్నరెడ్డి అనే భక్తురాలు 5 పరదాలు, తిరుపతికి చెందిన మణి 4 పరదాలు, కురాళాలు, కర్టన్లను ఆలయ అధికారులకు అందజేశారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక హర్షణీయం


విరుపాక్షరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : తూర్పు రాయలసీమ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నిక హర్షణీయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు విరుపాక్షరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని, ఇందులో భాగంగానే సర్కారు బడులను గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చీటీల వ్యాపారి అరెస్ట్

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో ప్రభుత్వ అనుమతి లేకుండా చీటీలు నడుపుతూ ఇటీవల ఐపీ పెట్టి ఉడాయించిన వ్యాపారి మురళిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ లక్ష్మీనారాయణ కథనం.. గత 20 ఏళ్లుగా పట్టణంలో అనధికారికంగా చీటీలు నడుపుతూ తనకు ఇవ్వాల్సిన రూ.27 లక్షలను చెల్లించలేదని జయంతి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శుక్రవారం పుత్తూరులోనే మురళిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అప్పు తీర్చలేదని ఆత్మహత్యాయత్నం


పలమనేరు ఆస్పత్రిలో భార్యాభర్తలు

పలమనేరు : తోటి ఉద్యోగిని నమ్మి అప్పు ఇస్తే తీర్చకుండా బెదిరింపులకు దిగడంతో మనస్థాపం చెందిన దంపతులు శుక్రవారం ఆత్మహత్యకు యత్నించారు. వివరాలు.. కుప్పం నియోజకవర్గం రామకుప్పం మండలంలోని కెంపసముద్రానికి చెందిన శ్రీనివాసులు(33), దేవి అలియాస్ బేబీ(28) భార్యాభర్తలు. తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న నరేష్ అనే సహచర ఉద్యోగికి తన వ్యక్తిగత అవసరాలకు అడిగితే రూ.4లక్షలు అప్పుగా ఇచ్చారు. అయితే 8 నెలలు గడుస్తున్నా నరేష్ తీసుకున్న సొమ్మును తిరిగి ఇవ్వలేదు. గట్టిగా అడిగితే తనకు పలువురు రాజకీయనేతల అండదండలు ఉన్నాయంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో దిక్కుతోచని దంపతులు పలమనేరు వచ్చి గుండుబావి సమీపంలోని ఓ లాడ్జిలో రూమ్ తీసుకుని పురుగుల మందు తాగేశారు. వాంతులు చేసుకుంటున్న ఇద్దరిని గమనించిన లాడ్జి సిబ్బంది వెంటనే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిసింది.

వైద్య పరిశోధనల్లో ఎస్వీ మెడికల్ కళాశాల ముందంజ


మాట్లాడుతున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా: వైద్య పరిశోధనల్లో ఎస్వీ మెడికల్ కళాశాల దేశంలోనే ముందంజలో ఉందని వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన శుక్రవారం ఎస్వీ మెడికల్ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఐసీఎంఆర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ హైదరాబాద్ సంయుక్తంగా చంద్రగిరిలోని ఆదర్శ గ్రామీణ ఆరోగ్య పరిశోధన కేంద్రంలో విజయవంతంగా పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 9 పరిశోధనలు పూర్తిచేశామని, మరో పదకొండు పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. కోవిడ్ వ్యాక్సిన్ వేసుకున్న వారికి ఏ మేరకు వ్యాధి నిరోధక శక్తి ఉందో తెలుసుకునేందుకు పరిశోధనలు చేస్తున్నామన్నారు. యుక్త వయసులో రక్తహీనత సమస్యను ఏ విధంగా అధిగమించాలన్న దానిపై, అలాగే తాగునీటిలో ఫ్లోరిన్ శాతాన్ని కనుక్కోవడం వంటి పరిశోధనలను చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. డాక్టర్ వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఎస్వీ మెడికల్ కళాశాల వేదికగా ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజులపాటు వైద్య విద్యార్థులకు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్టు చెప్పారు. సామాజిక వైద్య విద్య విభాగాధిపతి డాక్టర్ రవిప్రభు, డాక్టర్ కిరీటి, డాక్టర్ శరవణన్, డాక్టర్ పాహీం పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పుష్పయాగానికి అంకురార్పణ


పుష్పయాగం కార్యక్రమానికి పుట్టమన్ను సేకరిస్తున్న ఆలయ అర్చక స్వాములు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, మృత్సంగ్రహనం, సేనాధి ఉత్సవం, అంకురర్పాణ కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం జరగనుంది. శ్రీవారి పుష్పయాగం సందర్భంగా శనివారం నిత్య కల్యాణోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అగ్నివీర్–వాయు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి కల్చరల్: భారత వాయుసేనలో అగ్నివీర్–వాయు ఉద్యోగాలకు ఇంటర్, డిప్లొమా పూర్తిచేసుకున్న అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. సైన్స్ విభాగాల ఉద్యోగాలకు ఇంటర్ ఎంపీసీ 50 శాతం మార్కులతో, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మొబైల్, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెసిలైజేషన్‌తో 50 శాతం మార్కులతో మూడేళ్ల డిప్లొమా కోర్సు చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే సైన్స్ కాకుండా ఇతర విభాగాల ఉద్యోగలకు 50 శాతం మార్కులతో ఇంటర్ సరాసరి 50 శాతం మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిషులో 50 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. సీవో బీఎస్‌ఈ ద్వారా గుర్తింపు పొందిన శిక్షణా సంస్థలలో 50 శాతం మార్కులతో రెండేళ్ల ఒకేషనల్ కోర్స్ చేసి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు 17 ఏళ్ల 6 నెలల నుంచి 21 ఏళ్ల లోపు వయసు ఉండాలని చెప్పారు. ఆసక్తి గల వారు http://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మే 20వ తేదీ తర్వాత ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష ఉంటుందని, ఆన్‌లైన్‌కు 3 రోజుల ముందు అర్హత పరీక్ష అడ్మిట్ కార్డులు అభ్యర్థుల ఈ–మెయిల్ ఐడీకి పంపనున్నట్టు వెల్లడించారు.

పెళ్లి చేసుకోనందుకు జైలు

చిత్తూరు అర్బన్: పెళ్లి నిశ్చయం చేసుకున్న తర్వాత అకారణంగా నిరాకరించినందుకు ఓ వ్యక్తికి జైలుశిక్ష విధిస్తూ చిత్తూరులోని ప్రత్యేక ఎక్సైజ్ మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. వివరాలు.. ఐరాల మండలానికి చెందిన సుధీర్‌కుమార్ అనే వ్యక్తి చిత్తూరులోని కార్మికశాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతను ఓ యువతిని ప్రేమించాడు. 2013లో పెద్దలు సైతం వారి ప్రేమను అంగీకరించి, వివాహం నిశ్చయం చేశారు. తీరా ముహూర్తం సమీపించే సరికి సుధీర్ కుమార్ ఆ యువతిని పెళ్లి చేసుకునేందుకు ఒప్పు లేదు. దీంతో యువతి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు సుధర్‌కుమార్‌తోపాటు ఆయన కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశారు. దీనిపై కోర్టు విచారించి సుధీర్‌కుమార్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. అతడి తల్లి ధనలక్ష్మి, బావ మురళీ మోహన్, అన్న రాజశేఖర్‌కు ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ రవి తీర్పునిచ్చారు.

కల్యాణ మండపంలో చోరీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని వీఎంసీ కూడలి వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో భారీచోరీ జరిగింది. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ అంజుయాదవ్ కథనం మేరకు వివరాలు.. కేవీబీపురం మండలం, కళత్తూరుకు చెందిన యువతీ యుకులకు పట్టణంలోని వీఎంసీ కూడలిలోని కల్యాణ మంపడంలో గురువారం వేకువజామున పెళ్లి వేడుకలు ప్రారంభమయ్యాయి. వధూవరులకు సమీప బంధువు అయిన తిరుపతికి చెందిన మంజువాణి ఎర్రావారి పాళెంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంటారు. తన బంధువుల పెళ్లికి హాజరయ్యేందుకు తిరుపతి బ్యాంకు లాకర్ నుంచి నగలను తీసుకుని బయలుదేరారు. రాత్రి 1.30 గంటల సమయంలో 300 గ్రాముల బంగారు, వంద గ్రాముల వెండి ఆభరణాలు ఉన్న బ్యాగు తీసుకురాగా.. అది మాయమైంది. వారు శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ అంజుయాదవ్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరాల ద్వారా నిందితుని గుర్తించి త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. వివాహం యథావిధిగా జరిగింది.

అప్పు తీర్చమన్నందుకు దాడి


తీవ్ర గాయాలతో మునికృష్ణ

శ్రీకాళహస్తి రూరల్: తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వమని అడగటంతో దాడి చేసిన ఘటన శ్రీకాళహస్తి మండలంలో చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు వివరాలు.. మండలంలోని మంగళపురి పంచాయతీ, దొడ్లమిట్ట గ్రామానికి చెందిన మునికృష్ణ చెల్లెలు మునీశ్వరి అదే గ్రామానికి చెందిన రాజేంద్రకు కొంత నగదు అప్పు ఇచ్చింది. అయితే చాలాకాలం కావడంతో తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని గురువారం ఉదయం రాజేంద్రను అడిగింది. అయితే రాజేంద్ర, అతని కుమారుడు వంశీ దురుసుగా ప్రవర్తించడంతో మునీశ్వరి వెళ్లి ఆమె అన్న మునికృష్ణకు జరిగిన విషయం చెప్పింది. దీంతో రాజేంద్ర, మునికృష్ణ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం గురువారం రాత్రి రాజేంద్ర శ్రీకాళహస్తి నుంచి కొంత మంది వ్యక్తులను దొడ్లమిట్ట గ్రామానికి తీసుకెళ్లి మునికృష్ణపై దాడి చేశాడు. ఈ దాడిలో మునికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనం ద్వారా అతన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. మునికృష్ణ ఫిర్యాదు మేరకు రాజేంద్ర, అతని కుమారుడు వంశీపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సాహితీ బ్రహ్మోత్సవాలకు తరలిరండి


ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఇంద్ర

తిరుపతి కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఏప్రిల్ 9, 10 తేదీల్లో 48 గంటల పాటు వరల్డ్ రికార్డు కోసం చేపడుతున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు రచయితలు, కవులు, భాషాభిమానులు, కళాకారులు తరలిరావాలని శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కింగ్ ఇంద్ర పిలుపు నిచ్చారు. శుక్రవారం తిరుపతిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక జాతీయ అధికార ప్రతినిధిగా నియమితులైన ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సాహితీ బ్రహ్మోత్సవ ప్రోగ్రామ్ కన్వీనర్ గుత్తాహరిసర్వోత్తమ నాయుడుని ఘనంగా సత్కరించారు.

వ్యవసాయం ఓ క్రమపద్ధతిలో చేయాలి


మాట్లాడుతున్న డీఏఓ ప్రసాద్‌రావు

తిరుపతి అర్బన్: వ్యవసాయం ఓ క్రమపద్ధతిలో చేస్తేనే మంచి దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్. ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రబీలో 2.05లక్షల ఎకరాల్లో పంట నమోదు చేయడంతోపాటు 99శాతం ఈకేవైసీ పూర్తయ్యిందన్నారు. ఇందులో భాగంగానే ఈనెల13 నుంచి 17వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించినట్లు చెప్పారు. ఖరీఫ్‌లో రైతులకు వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో అందజేస్తామన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ చిన్న తరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను 33శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు చెప్పారు. కొబ్బరి, మామిడి మొక్కలు శ్రీకాళహస్తిలోని ఉద్యానశాఖ నర్సరీలో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి రవికుమార్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధికి వ్యాక్సినేషన్ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఏవైనా సమస్య లుంటే పాడి రైతులు 1962 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వర్మికంపోస్టుతో కాలుష్య నివారణ


తయారైన వర్మికంపోస్టును పరిశీలిస్తున్న రిసోర్స్ పర్సన్

సత్యవేడు: వర్మికంపోస్టుతో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని జగనన్న స్వచ్ఛ సంకల్పం జిల్లా రిసోర్స్ పర్సన్ జి.రవికుమార్ తెలిపారు. శుక్రవారం సత్యవేడులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వర్మికంపోస్టు తయారు చేయనున్నట్టు తెలిపారు. బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురం, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల పరిధిలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లుకు ఈనెల 23 నుంచి 28 వరకు సత్యవేడుల ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మునిరవికుమార్, సచివాలయ కార్యదర్శులు సునీల్‌కుమార్, హరీష్, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, శానిటరీ మేస్త్రీ శివయ్య పాల్గొన్నారు.

నేడు అన్నమయ్య సప్తగిరి సంకీర్తనా గోష్టిగానం

తిరుమల: పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 520వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో సప్తగిరి సంకీర్తనా గోష్టిగానం జరగనుంది. శ్రీవారి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఊరేగింపుగా బయల్దేరి సాయంత్రం 5.30 గంటలకు నారాయణగిరి ఉద్యానవనాలకు చేరుకుంటారు. అన్నమాచార్య గురుపరంపరకు చెందిన శ్రీ అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీమాన్ శ్రీవణ్ శఠగోప శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామీజీ విచ్చేయనున్నారు. ఈ సందర్భంగాతాళ్లపాకవంశీయులను సన్మానించనున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 59,776 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా.. అందులో 25,773 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.96 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామివారి దర్శనం లభిస్తోంది.

ఇంటర్నేషనల్ కరాటే పోటీలకు ఎంపిక


కరాటే పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

సత్యవేడు: గోవాలో ఈనెల 29, 30 తేదీలలో జరగనున్న థర్డ్ ఏసీఎస్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు సత్యవేడు విద్యార్థులు ఎంపికైనట్లు కరాటే మాస్టరు ఎస్.కన్నయ్య తెలిపారు. ఫిలోకోషి సోటోకాల్ కరాటే స్పోర్ట్స్ అకాడమీ తరపున వీరు పాల్గొంటారన్నారు. పోటీలకు ఎంపికైన వారిలో ఏ.మోక్షిత, ఏ.తనుహియా, సి.గీతిక, పి.హేమసుందరం, ఎం.దీక్షి, ఎం.మానక్ష, సి.గీతిక, కే.కౌశిక్‌వర్మ ఉన్నట్టు ఆయన వెల్లడించారు.